క్లుప్తంగా

రైతు సంక్షేమమే ధ్యేయం

- సబ్సిడీలను సద్వినియోగం చేసుకోండి
- ఉద్యాన శాఖాధికారి అక్షితరెడ్డి



బిందు సేద్య పరికరాలను పరిశీలిస్తున్న అక్షితరెడ్డి

మోమిన్‌పేట: రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఉద్యాన శాఖాధికారి అక్షితరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలో సబ్సిడీపై అందించిన డ్రిప్ పరికరాలు ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కూరగాయ పంటల సాగుకు అవసరమైన సబ్సిడీలను మంజూరు చేస్తుందన్నారు. సబ్సిడీపై బిందు సేద్య, తుంపర సేద్య పరికరాలను పంపిణీ చేస్తుందన్నారు. బొప్పాయి, అరటి తోటలకు సబ్సిడీపై బిందు సేద్య పరికరాలు అందిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా, పసుపు సాగు చేసే రైతులకు ప్రోత్సాహకంగా ఎకరాకు రూ.16వేలు, ఉల్లి సాగు చేసే రైతులకు హెక్టారుకు రూ.20వేలను అందజేస్తున్నారని వివరించారు.

స్నేహితునికి అండగా పూర్వ విద్యార్థులు



స్నేహితునికి సాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

పరిగి: పట్టణ కేంద్రంలోని నంబర్2 ఉన్నత పాఠశాలలో 2002–03 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు తోటి స్నేహితుడు ఆపదలో ఉన్నాడని తెలుసుకొని స్నేహితులు సాయం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..పట్టణ కేంద్రానికి చెందిన అఫ్సర్ అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారనే విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు చందాలు వేసుకుని రెండు, మూడు నెలలకు సరిపడ వంట సామాన్లతో పాటు కొంత నగదు అందజేశారు. భవిష్యత్‌లో కూడా ఎలాంటి సాయం కావాలన్న తమ దృష్టికి తీసుకురావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, శ్రీనివాస్, మల్లేష్, బాబ, ప్రవీణ్, బుచ్చయ్య, చిమ్నా, సందీప్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే పకడ్బందీగా నిర్వహించండి

తహసీల్దార్ తారాసింగ్



బీఎల్‌ఓల శిక్షణను పరిశీలిస్తున్న తహసీల్దార్ తారాసింగ్

తాండూరు రూరల్: ఓటర్ల సర్వేను పకడ్బందిగా నిర్వహించాలని తాండూరు మండల తహసీల్దార్ తారాసింగ్ పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామంలో, పట్టణంలో 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు గాను బీఎల్‌ఓలు విస్తృత ప్రచారం చేయాలన్నారు. అదేవిధంగా కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, ఓటర్ జాబితాలో తప్పొప్పులను సరిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లలిత, మాస్టర్ ట్రైనర్స్ వీరేశం, ముజాయిద్ తదితరులు పాల్గొన్నారు.

పోలేపల్లిలో పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



పోచమ్మ తల్లి విగ్రహం

దుద్యాల్: మండల పరిధిలో పోలేపల్లిలోని 8వ వార్డులో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారి విగ్రహాన్ని గ్రామస్తులు ప్రతిష్ఠించారు. బుధవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలతో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం దగ్గర ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో ఇంటర్నెట్

- మండలంలో 16 పీఎస్, యూపీఎస్‌ల ఎంపిక
- బీఎస్‌ఎన్‌ఎల్ నుంచి ప్రసారం



కంప్యూటర్‌లో పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థులు

దౌల్తాబాద్: సర్కారు బడుల్లో అమలు చేస్తున్న ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని మెరుగు పర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. సమగ్ర శిక్షలో భాగంగా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ భాగస్వామ్యంతో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఉచిత ఇంటర్నెట్ సేవలను అందించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు సంబంధించి సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి విడతలో కంప్యూటర్లు అందుబాటులో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఎంపిక చేసి జాబితా విడుదల చేశారు. అనంతరం వారం రోజుల క్రితం కొన్ని పాఠశాలలకు కంప్యూటర్లు పంపిణీ చేశారు. మండలంలో 16 పీఎస్, యూపీఎస్ స్కూళ్లను గుర్తించారు. వాటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇన్‌స్టాలేషన్‌కు సంబంధించి ఫార్మెట్ ప్రకారం ప్రతీ శనివారం ఈ–మెయిల్ ద్వారా ప్రభుత్వానికి జిల్లా విద్యాశాఖ అధికారులు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైన వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించాలని అందులో పేర్కొన్నారు. ఉచిత ఇంటర్నెట్ సేవలు ప్రారంభం కాబోతుండడంతో ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాంతో పాటు ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం ఉండదు.

కంప్యూటర్లు పంపిణీ చేశాం..

మండలంలోని 16 పాఠశాలలకు కంప్యూటర్లు మంజూరయ్యాయి. వారం క్రితం కొన్ని స్కూళ్లకు అందజేశారు. మరి కొన్ని రానున్నాయి. త్వరలో బడులలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం . ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మేలు జరగనుంది.

– వెంకట్‌స్వామి, ఎంఈఓ, దౌల్తాబాద్

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఏడీఏ సౌభాగ్యలక్ష్మికుమారి



ఓ ఫెర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న సౌభాగ్యలక్ష్మికుమారి

దోమ: అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పరిగి ఏడీఏ సౌభాగ్యలక్ష్మికుమారి పేర్కొన్నారు. బుధవారం దోమ మండలంలోని ఆయా ఫెర్టిలైజర్ దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి దుకాణదారులు రైతులకు అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే లైసెన్సులు రద్దు చేసి దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయా రైతు వేదికలలో ఏఈఓలు చేస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీని ఆమె పరిశీలించారు. రైతుల నుంచి డబ్బులు వసూళ్లు చేసి రిజిస్ట్రీ చేస్తే ఏఈఓలపై కఠిన చర్యలు తప్పవన్నారు. దాంతో పాటు దాదాపూర్ గ్రామంలో రైతులు వేసుకున్న పచ్చిరొట్ట విత్తనాలను ఆమె పరిశీలించారు. పూత దశలోకి వచ్చిన వెంటనే పంటను కలియదున్నితే సాగు చేసే పంటకు మేలు జరుగుతుందని చెప్పారు. ఎకరానికి రెండు బస్తాల సింగిల్ సూపర్ పాస్ఫరేట్ వేసి దుక్కిని మురగబెడితే రైతులకు మరింత దిగుబడులు చేకూరుతాయని ఆమె సూచించారు. ప్రతీ రైతు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తప్పకుండా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు, ఏఈఓలు చెన్నయ్య, బాబ్య, శ్రవణ్, ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య



చెత్త సేకరణ తదితర విషయాలపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య

పరిగి: తడి, పొడి చెత్తను వేరు చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య సిబ్బందికి సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని 9వవార్డు, శాంతినగర్‌కాలనీలో పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడటం వల్ల మానవాళికి ముప్పు కలుగుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపేసి కాటన్ బ్యాగులు ఉపయోగించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం రోజురోజుకు పెరుగుతుండటంతో పర్యావరణం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వివరించారు. కాబట్టి ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని, ఎవరైనా ప్లాస్టిక్ బ్యాగులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీరోజు ప్రతి కాలనీకి చెత్త వాహనాలు వస్తున్నాయని సిబ్బందికి చెత్త ఇచ్చేటప్పుడు తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు. అధికారులు కూడా ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దశరథ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

- ప్రతీ విద్యార్థి ఒక్కో మొక్కను దత్తత తీసుకోవాలి
- ప్రధానోపాధ్యాయుడు రమేశ్



ఏన్కతల ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు తదితరులు

మోమిన్‌పేట: మొక్కలతోనే మానవ మనుగడ కొనసాగుతుందని, ప్రతీ విద్యార్థి ఒక్కో మొక్కను దత్తత తీసుకొని సంరక్షించాలని ప్రధానోపాధ్యాయుడు రమేశ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఏన్కతల ప్రాథమిక పాఠశాల ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకొని సంరక్షించాలన్నారు. మొక్కలను నాటడమే కాదు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు.

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి..

పరిగి: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని సయ్యద్‌పల్లి గ్రామంలో విద్యార్థులకు, గ్రామస్తులకు ఐదు చొప్పున మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు.

శివలింగానికి జలాభిషేకం



శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

మర్పల్లి: పట్లూర్ గ్రామంలోని సోమేశ్వర ఆలయంలో బుధవారం ఉదయం గ్రామస్తులు పూజారుల సమక్షంలో వరుణదేవుడు కటాక్షించి వర్షాలు కురిపించాలని 1,001 బిందేలతో శివలింగానికి జలాభిశేకం నిర్వహించారు. ఈ సంవత్సరం మే నెలలో వర్షాలు కురువడంతో జూన్ మెదటి వారంలోనే రైతులు విత్తనాలు వేశారు. మరికొంత మంది చివరి వారంలో విత్తనాలు వేసుకున్నారు. ఇప్పుడు వాటికి సరిపడ తేమ, వర్షాలు కురువకపోవడంతో మెలకెత్త లేవు. దీంతో వరుణ దేవుని కటాక్షం కోసం సోమేశ్వర ఆలయంలోని శివలింగానికి జలాభిశేకం చేసి ప్రత్యే పూజలు నిర్వహించారు.

నోట్‌బుక్కులు పెన్నుల పంపిణీ



నోట్‌బుక్కులు అందిస్తున్న ఉపాధ్యాయులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని బస్‌లింగమ్మ భర్త వెంకట్‌రాములు స్మారకార్థం విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్కులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సాయిలు మాట్లాడుతూ పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమన్నారు. అలాగే ఇండాపూర్ పాఠశాలలో కోస్గి సంజయ్ డిజిటల్ వారు విద్యార్థులకు టై, బెల్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ చైర్మన్ అనురాధ, సీఆర్పీ నారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమ పథకాలు



మోమిన్‌పేట: ఇజ్రాచిట్టంపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోయించిన సుభాశ్



యాలాల: ఇళ్ల నిర్మాణ పనులకు ముగ్గులు వేయిస్తున్న రాజేందర్‌రెడ్డి తదితరులు

మండల అధ్యక్షుడు సుభాశ్

మోమిన్‌పేట: కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని యువ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుభాశ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఇజ్రాచిట్టంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని దశలవారీగా అమలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే పేదలకు ఇళ్లు మంజూరు చేసి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఇళ్లు లేని ప్రతిపేదోడికి తప్పని సరిగా ప్రభుత్వం సాయం చేస్తుందన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

యాలాల: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని యాలాల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ లబ్ధిదారులతో కలిసి ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఎన్నికల హామీల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి దశలవారీగా అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, నాయకులు నాగయ్య, శేఖర్, చంద్రశేఖర్, ఉమేశ్, మౌలాన, శ్రీనివాస్, లింగప్ప, అశోక్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బీసీల పక్షపాతి

ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ లక్ష్మణ్ ముదిరాజ్

అనంతగిరి: కాంగ్రెస్ బీసీల పక్షపాతని ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ లక్ష్మణ్ ముదిరాజ్ పేర్కొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నందున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్ల కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని పేర్కొన్నారు. ఈ రిజర్వేషన్లతో స్థానిక సంస్థల్లో 42శాతం మంది బీసీలు ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోబడుతారని తెలిపారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్ పార్టీ విధానమని పేర్కొన్నారు. రిజర్వేషన్ల కోసం కృషి చేసిన వికారాబాద్ ఎమ్మెల్యే, శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్‌కు బీసీలంతా రుణపడి ఉంటారని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



పార్టీ శ్రేణులతో సమావేశమైన నర్సిరెడ్డి తదితరులు

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి

యాలాల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేడికొండ నర్సిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జుంటుపల్లి, అక్కంపల్లిలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అందరికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఇళ్లు రానివారికి మలిదశలో అందిస్తామని, ఇందులో గ్రూపులు, అసంతృప్తి లేకుండా చూడాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం, కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, డైరెక్టర్లు రాజు, మొగులప్ప, నర్సింహులుగౌడ్, మత్స్య సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, అమృతప్ప, మహిపాల్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా వ్యవహరించాలి

తాండూరు ఆర్టీసీ డిపోను పర్యవేక్షించిన ఆర్ఎం శ్రీలత



తాండూరు డీఎంను వివరాలు అడిగి తెలుసుకుంటున్న శ్రీలత

తాండూరు టౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వ్యవహరించాలని రంగారెడ్డి డివిజన్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీలత సిబ్బందితో పేర్కొన్నారు. బుధవారం ఆమె తాండూరు డిపోను పర్యవేక్షించారు. మహాలక్ష్మి పథకం కొనసాగుతున్న తీరుపై ఆరా తీశారు. డిపో పరిధిలో నడుస్తున్న బస్సు సర్వీసులు, ఆక్యుపెన్సీ, రోజు వస్తున్న నగదు, ఆన్‌లైన్ పేమెంట్లు, ఆయా సమస్యలపై మేనేజర్ సురేశ్ కుమార్‌ను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారిపై సాదారంగా వ్యవహరించాలన్నారు. వేళకు బస్సులు నడుపుతూ ఆక్యుపెన్సీపై దృష్టి సారించాలన్నారు. ఆమెతో పాటు డిప్యూటీ ఆర్ఎం(ఆపరేషన్స్) సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

❖ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్ రూరల్: కొడంగల్ పట్టణంలో కొత్త 11కెవి లైన్ పనుల నేపథ్యంలో గురువారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ అర్జున్‌కుమార్, ఏఈ ప్రవీణ్‌కుమార్ బుధవారం ప్రకనటలో తెలిపారు. పట్టణంలోని మిషన్ భగీరథ, కొడంగల్ పట్టణం, మండలంలోని ఉడిమేశ్వరం, అప్పాయిపల్లి, బొంరాస్‌పేట మండలంలోని ఎన్కేపల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించగలరని వారు కోరారు.

❖ నేడు పూడూరుకు ఎమ్మెల్యేరాక

పూడూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి రానున్నారని మండల అధ్యక్షుడు సురేందర్ తెలిపారు. గురువారం ఉదయం తుర్క ఎన్కేపల్లి, నిజాంపేట్‌మేడిపల్లి, చింతలపల్లి, కంకల్, పుడుగుర్తి, మేడిపల్లికలాన్, కడుమూరు మిట్టకంకల్, కుత్బుల్లాపూర్, ఎన్కేపల్లి, గొంగుపల్లి, మన్నేగూడ, కొత్తపల్లి, తిమ్మాపూర్ మేడికొండ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

❖ ఖలీల్‌పై చర్యలు తీసుకోవాలి

ధారూరు: రైతులను మోసం చేస్తున్న సర్పన్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచు ఖలీల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు అధికారులను కోరారు. వివరాలు ఇలా ఉన్నాయి..రైతుల నుంచి భూములను కొనగోలు చేసి వారికి చెల్లని చెక్కులు ఇస్తూ మోసం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. భూమి కొనుగోలు చేసి డబ్బులను చెల్లని చెక్కు రూపంలో ఇవ్వడంతో తన తండ్రి మృతి చెందాడని రైతు మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. అంతారం గ్రామ సమీపంలోని అసైన్డ్ భూమిని ఖలీల్ కబ్జా చేశాడని హన్మంత్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కలెక్టర్ జోక్యం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

❖ ఆర్థిక సహాయం అందజేత

దుద్యాల్: పోలేపల్లి గ్రామానికి చెందిన నప్పరి అంజిలమ్మ కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు తమ వంతు చందాలు వేసుకున్నారు. అంతే కాకుండా ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం ద్వారా వసూలైన మొత్తాని సేకరించి రూ. 50వేలను భర్త కిష్టప్పకు అంత్యక్రియల నిమిత్తం అందజేశారు.

సమయ పాలన పాటించాలి

- ఉపాధ్యాయులు ప్రార్థనకు హాజరుకావాలి
- పెద్దేముల్ ఎంఈఓ నర్సింగ్‌రావు



తాండూరు రూరల్: మంబాపూర్ పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న ఎంఈఓ నర్సింగ్‌రావు

తాండూరు రూరల్: ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి, తప్పనిసరిగా ప్రార్థనకు హాజరు కావాలని పెద్దేముల్ ఎంఈఓ నర్సింగ్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మంబాపూర్, కొండాపూర్, రుక్మాపూర్ ప్రభుత్వ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మంబాపూర్ పాఠశాలలో విద్యార్థులతో ప్రార్థన చేయించారు. రుక్మాపూర్, కొండాపూర్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ..వర్షాకాలం సందర్భంగా వంటల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేసిన కొత్త వంట పాత్రల్లోనే భోజనం వండాలన్నారు. ప్రతీరోజు పౌష్టికాహారం వండి పెట్టాలన్నారు.

పౌష్టికాహారం వడ్డించాలి

యాలాల: విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం వడ్డించాలని తహసీల్దార్ వెంకటస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో ఎంపీడీఓ పుష్పలీలతో కలిసి తనిఖీ చేశారు. కేజీబీవీలో వంట గది పరిసరాలు, వంట పాత్రలు, మెనూ, భోదన పద్ధతి, విద్యార్థుల సౌకర్యాలు, తాగునీటి వసతి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శివచరణ్, కేజీబీవీ ఎస్ఓ మంగమ్మ, సిబ్బంది క్రిష్ణవేణి, గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: విద్యార్థులకు నాణ్యమైన బోజనం పెట్టాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను తహసీల్దార్ రవీందర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా వండిపెట్టాలన్నారు. ప్రభుత్వ మెను ప్రకారం ప్రతీరోజు వండాలన్నారు. ఆమె వెంట ఎంఈఓ మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యాలాల: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి తదితరులు



కొడంగల్: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు

మధ్యాహ్న భోజనం తనిఖీ

కొడంగల్: పట్టణ శివారులోని మహాత్మా జ్యోతీరావు పూలే బాలుర గురుకుల పాఠశాలను తహసీల్దార్ విజయ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదిని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వంటగది, హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

బంట్వారంలో..

బంట్వారం: మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎంఈఓ వెంకటేశ్వర్‌రావుతో కలిసి బంట్వారం మండల కేంద్రంలోని కేజీబీవీ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.